జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అమ్మ ఫౌండేషన్ వైర్ పర్సన్ మల్లు నందిని

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కస్తూర్బా గాంధీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు

మారేడ్‌పల్లి, జూలై 2: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మారేడ్‌పల్లి లోని కస్తూర్బా గాంధీ డిగ్రీ, పీజీ మహిళా కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కస్తూర్బా గాంధీ పేరుతో స్థాపించిన ఈ కళాశాల మహిళా సాధికారితకు విశేషంగా కృషి చేస్తున్నదన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత కాలంలో కళాశాలల్లో డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ తదితర కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వైర్ పర్సన్ మల్లు నందిని, ప్రత్యేక అతిథులుగా ప్రొఫెసర్ టీవీ గోపాలాచారి, ఓజీఏ ప్రెసిడెంట్ సత్యేందర్ వనం, ఎగ్జిబిషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ బీఎన్ రాజేశ్వర్ రావు, ఓసీఓ సెక్రటరీ బి.హనుమంతరావు, ఎగ్జిబిషన్ సొసైటీ సెక్రటరి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓయూ రిజిస్ట్రార్, ఇంకా కళాశాల చైర్మన్ అశోక్ గోపతి, సెక్రటరి, కరస్పాండెంట్ మహ్మద్ ఫహీముద్దీన్, ఉమా మహేశ్వర్ రావు, వైస్ చైర్మన్ డి.సురేష్ కుమార్, జాయింట్ సెక్రటరి డాక్టర్ ఎం.శైలజరాజ్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రాజశ్రీలత, రిటైర్డు ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది వివిధ కళాశాలల ప్రధానోపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి చేతుల మీదుగా కళాశాల సావెనీర్ ఆవిష్కరించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు స్వర్ణ పతకాలను అందజేశారు.

ఐదు దశాబ్దాల చరిత్ర ఎస్సీ కళాశాలది

ఆడిటోరియాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

బన్సీలాల్‌పేట్, జూలై 2: ఎందరినో తీర్చిదిద్దిన సర్దార్ పటేల్ కళాశాలది ఐదు దశాబ్దాల చరిత్ర అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కళాశాలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఎస్సీ కళాశాల పాలక మండలి కృషి అభినందనీయమని కొనియాడారు. పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కళాశాలలో నూతన ఆడిటోరియం, కామర్స్ విభాగం భవనాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు దశాబ్దాల చరిత్ర కలిగిన ఎస్సీ కళాశాలలో చదివిన ఎందరో విద్యార్థులు నేడు దేశ, విదేశాలలో ఉన్నతమైన స్థానాలలో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఉత్తమ ఉద్యోగులైన పరిపాలనా అధికారి రాహుల్ యాదవ్, సూపరింటెండెంట్ జావిద్ హుస్సేన్‌లకు మంత్రి సన్మానం చేశారు. కళాశాల కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి కళాశాలలో ఆడిటోరియం, కామర్స్ బ్లాక్‌లను నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలక మండలి చైర్మన్ ఎస్.రాజేందర్, కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి, కోశాధికారి సూరజ్ సింగ్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యేందర్, సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.హేమలత, వైస్ ప్రిన్సిపాల్ ఎం.అమర్నాథ్ శర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరుద్యోగంపై సీఎం ఉలుకూ పలుకేది?

పీడీఎస్‌యూ ఓయూ కమిటీ నాయకులు

- శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేవైఎం ఆందోళన
- నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి: బీజేవైఎం అధ్యక్షుడు నితిన్
- ఎంజే మార్కెట్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

> సమస్యలు పరిష్కరించాలంటూ నగర వ్యాప్తంగా నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన బాట పట్టారు. ఉద్యోగాల విషయంలో రేవంత్ రెడ్డి అధికారంలోకి రాక ముందు నిరుద్యోగులకు హామీల మీద హామీలు గుప్పించి, అధికారం వచ్చాక నిరుద్యోగులను, వారి సమస్యలను పక్కనబెట్టారు. అంటే.. 'ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా..' కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరున్నదని చెప్పకనే చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో మంగళవారం నగర వ్యాప్తంగా పలుచోట్ల పలు విద్యార్థి సంఘాలు ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేస్తూ ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేపట్టాయి. సీఎం స్పందించకుంటే.. ఇంటికి పంపించే కార్యక్రమాన్ని చేపడ్తామని నిరుద్యోగ యువత నిరసన గళం పెద్ద పెట్టున వినిపిస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 2: నిరుద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పోస్టుల సంఖ్యను పెంచాలని, మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఓయూ కమిటీ మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు ఎస్.నాగేశ్వరరావు, ఓయూ అధ్యక్షుడు సుమంత్ మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీల ద్వారా ఏర్పడిన ఖాళీలను కలిపి, మెగా డీఎస్సీ నిర్వహించినపుడే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. వివిధ రకాల గ్రూప్ ఉద్యోగాల లో పోస్టులు తగిన మొత్తంలో లేవని, తక్షణ మే పోస్టుల సంఖ్యను పెంచి, భర్తీ చేయాలన్నారు. పీడీఎస్‌యూ నాయకులు రుక్మత్ పా షా, అంజి, ప్రశాంత్, సతీశ్, క్రాంతి, కోటేశ్వర్, శ్రీవాణి, సౌజన్య, భవాని, రామ్ పాల్గొన్నారు.

శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీజేవైఎం నాయకులు

సీఎంను ఇంటికి పంపించేందుకు సిద్ధం..

నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం..

శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేవైఎం ఆందోళన

శంషాబాద్ రూరల్, జూలై 2: నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని బీజేవైఎం శంషాబాద్ మండలాధ్యక్షుడు బుక్కా ప్రవీణ్ ఆరోపించారు. నిరుద్యోగులను ఆదుకుంటామని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వారిని ఆదుకోక పోగా.. అరెస్టులతో పాటు దాడులు చేస్తుండటంతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడు నెలలు దాటినా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డిని త్వరలో ఇంటికి పంపించడానికి నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం, తహసీల్దార్ నాగమణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగుల హామీలకు పరిష్కారం ఎక్కడా?

బీజేవైఎం అధ్యక్షుడు నితిన్ నందాకర్

ఎంజే మార్కెట్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

సుల్తాన్ బజార్, జూలై 2: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే నేరవేర్చాలని భారతీయ జనతా యువ మోర్చా హైదరాబాద్, గోల్కొండ జిల్లా అధ్యక్షుడు నితిన్ నందాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నిరుద్యోగ భృతిని ఇవ్వాలని నాంపల్లిలోని మండల రెవెన్యూ కార్యాలయం వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్ళాలని నాంపల్లి ఎంఆర్‌వోకు ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం, ఆయన మాట్లా డుతూ ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పిస్తామన్న హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా నిరుద్యోగుల పట్ల ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేక పోవడం, 'దున్నపోతు మీద వర్షం పడ్డ చందంగా..' ఉన్నదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో 1:100 శాతం ప్రకారం, క్వాలిఫై చేయాలని, గ్రూప్-2, గ్రూప్-3 నోటిఫికేషన్లలోఅదనంగా పోస్టులను పెంచాలని, 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని, ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను పోస్ట్‌ఫోన్ చేసి నూతన తేదీలను ప్రకటించాలని, అన్ని నియామకాలలో మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్ కేటాయించాలని, పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీవో నం.46ను రద్దు చేయాలని, జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎంజే మార్కెట్ వద్ద దిష్టిబొమ్మ దహనం

మోజం జాహి మార్కెట్ చౌరస్తాలో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ మేరకు మంగళవారం రాహుల్ గాంధీ డౌన్ డౌన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం అధ్యక్షుడు నితిన్ నందాకర్ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేవైఎం నాయకులను పోలీసులు అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు.

ఎంజే మార్కెట్ చౌరస్తాలో కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం హైదరాబాద్, గోల్కొండ జిల్లా అధ్యక్షుడు నితిన్ నందాకర్

కాంగ్రెస్ కార్పొరేటర్లలో కలహం..

రెండు వర్గాలుగా విడిపోయిన కార్పొరేటర్లు

ప్రస్తుత ఫ్లోర్ లీడర్‌ను తొలగించాలి: హై కమాండ్‌కు ఫిర్యాదు

రేపో మాపో కొత్త లీడర్‌ను ఎన్నుకునేందుకు సమావేశం

బడంగ్‌పేట, జూలై 2: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్యన వివాదం ముదిరింది. రెండు వర్గాలుగా విడిపోయారు. వారి మధ్యన విభేదాలు తారాస్థాయికి చేరాయి. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 32 డివిజన్లు ఉన్నాయి. కార్పొరేషన్‌లో 14 మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్, 10 మంది కార్పొరేటర్లు బీజేపీ, ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా ఉన్నారు. ప్రస్తుతం మేయర్‌గా ఉన్న చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లో చేరారు. మేయర్‌తో పాటు రాళ్ల గూడం సంతోషి శ్రీనివాస్ రెడ్డి, పెద్ద బావి సుదర్శన్ రెడ్డిలు మేయర్‌తో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆ తర్వాత మేయర్, ఇద్దరు కార్పొరేటర్లతో కలిసి తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి పోయారు. ప్రస్తుతం, కాంగ్రెస్ పార్టీకి ఏడుగురు కార్పొరేటర్లు ఉన్నారు. కొంత కాలం నుంచి వీరి మధ్యన అంతర్గత విభేదాలు చోటు చేసుకున్నాయి. కార్పొరేటరు వంగేటి ప్రభాకర్ రెడ్డి, బండారు మనోహర్, ఎర్ర మహేశ్వరి జైహింద్, బాలు నాయక్, రాళ్ల గూడెం సంతోషి శ్రీనివాస్ రెడ్డిలు మేయర్ ఒంటెద్దు పోకడపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు చేశారు. ఎమ్మెల్యే ఎన్నికల సమయం నుంచి వీరి మధ్యన పచ్చగడ్డి వేస్తే భగ్గు మంటుంది. కొంత కాలం పాటు ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి కార్పొరేటర్లతో ఉంటూనే మేయర్‌కు అనుకూలంగా వ్యవహరించడం పట్ల నలుగురు కాంగ్రెస్ కార్పొరేటర్లు ఏకమై తిరుగు బావుటా ఎగురవేశారు. మేయర్‌కు సంబంధం లేకుండా వారే కాంగ్రెస్ పార్టీ మంత్రులను కల్వడం, నియోజకవర్గం ఇన్‌చార్జి, జిల్లా అధ్యక్షుల టచ్‌లోకి పోయారు. ఇది గమనించిన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి నలుగురు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లను పక్కన పెట్టి బీజేపీ కార్పొరేటర్లతో కలిసి ఉంటున్నారని ఆరోపణలున్నాయి. ఇదే అంశాన్ని కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ దృష్టికి తీసుకుపోయారు. ఐనా కూడా మేయర్, ఫ్లోర్ లీడర్‌లో మార్పు రాకపోవడంతో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డిని తొలగించి ఎర్ర మహేశ్వరి జైహింద్‌ను కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఎన్నుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఫ్లోర్ లీడర్‌గా ఎన్నుకొని బుధవారం బడంగ్‌పేట కమిషనర్‌కు లేఖ అందజేయనున్నట్లు తెలిసింది. మేయర్ తీరుపై కూడా గుర్రుగా ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్యన ఉన్న విభేదాలు మరోసారి బహిర్గతం అవుతున్నాయి. అధిష్టానం కూడా నలుగురు కార్పొరేటర్లకు మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. ఇక నుంచి వంగేటి ప్రభాకర్ రెడ్డి కార్పొరేటర్‌గానే ఉంటారు. తప్ప ఫ్లోర్ లీడర్‌గా తాము ఒప్పుకోవడం లేదని తీర్మానం చేసుకున్నట్లు తెలిసింది. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ కార్పొరేటర్లలో ముసలం మొదలైంది.

గోల్కొండలో మందకొడిగా బోనాల ఏర్పాట్లు

- జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో బ్రాస్ తాపడం పని పూర్తి
- ప్రభుత్వ శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- మంత్రి ఆదేశాలను పట్టించుకోని అధికార యంత్రాంగం

బ్రాస్ తాపడం పూర్తయిన జగదాంబిక ఎల్లమ్మ ఆలయం

మెహిదీపట్నం, జూలై 2: తెలంగాణ ఆషాఢ మాసం బోనాలు జూలై 7వ తేదీన చారిత్రాత్మక గోల్కొండ కోటలో నెలవైన జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారులు ఆలయంలో సన్నాహాలు ప్రారంభించారు. ఆలయానికి బ్రాస్ తాపడం పనులు పూర్తి చేశారు. అంతకు ముందు రంగులు వేసే పనులను కూడా అధికారులు దాదాపుగా పూర్తి చేయించారు. ఇవి కాకుండా ఆలయంలో బోనాలు సమర్పించడానికి వచ్చే భక్తుల కోసం చేపట్టాల్సిన పనులు మంద కొడిగా సాగుతున్నాయి. బారికేడ్ల ఏర్పాటుకు సోమవారం మధ్యాహ్నం తర్వాత పనులను ప్రారంభించగా, వాటర్ ట్యాంకర్ల, పైపులైన్ల ఏర్పాటు పనులు పత్తా లేవు. జగదాంబిక ఎల్లమ్మ ఆలయం ముందు షెడ్ వేయాల్సి ఉండగా, ఆ పనులు కూడా ఇంకా చేయలేదు. గోల్కొండ కోటకు వచ్చే రోడ్లపై ఎక్కడ చూసినా అపరిశుభ్రత వాతావరణంతో పాటు రోడ్ల గుంతలు అలాగే ఉన్నాయి. గోల్కొండ కోట బోనాల పనులను జూలై 5వ తేదీ వరకు పూర్తి చేయాలని ప్రభుత్వ శాఖల అధికారులకు మంత్రి కొండా సురేఖ సూచించారు. కానీ, ఇప్పటికీ అసలు బోనాల పనులు జరుగుతున్న దాఖలాలు లేవు. గోల్కొండ కోటపై ఉన్న జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో తెలంగాణ ఆషాఢ మాసం బోనాలు నెల రోజుల పాటు జరుగుతాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేండ్లుగా తెలంగాణ ఆషాఢ బోనాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించి అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తెచ్చి పెట్టింది. బోనాలు ప్రారంభం కావడానికి ఇంకా నాలుగు రోజులే ఉన్నప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లు చేయలేక పోతుంది. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ఉంటూ బోనాలను విజయవంతంగా నిర్వహిస్తాయా? లేదా? అని గోల్కొండ, లంగర్‌హౌస్ ప్రాంతాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

దేవాదాయ శాఖ తప్ప ఆర్ అండ్ బీ, జీహెచ్ఎంసీ, విద్యుత్, జల మండలి, ఎంటమాలజీ, పారిశుద్ధ్య విభాగం అధికారులు పనిచేస్తున్నట్లుగా కనిపించడం లేదు. మంత్రి ఆదేశాలను అధికారులు పాటించడం లేదన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.

సోషల్ కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఫ్రీడమ్ కుకింగ్ ఆయిల్స్ మంగళవారం నాలెడ్జ్ సిటీలోని టీ - హబ్‌లో 'డైలాగ్ ఇన్ ది డార్క్' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఇందులో టీ - హబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహంకాళి శ్రీనివాస రావు, జెమిని, ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ మేకర్స్ ఆఫ్ ఫ్రీడమ్ హెల్త్ కుకింగ్ ఆయిల్స్ గ్రూపు వైస్ ప్రెసిడెంట్ అక్షయ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. – కొండాపూర్

కాంగ్రెస్‌లోకి..మేడ్చల్ చైర్‌పర్సన్

మేడ్చల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మర్రి దీపికా నర్సింహా రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ జడ్పీ ఫ్లోర్ లీడర్ సింగిరెడ్డి హరివర్దన్ రెడ్డి సమక్షంలో ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆమెతో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, కౌన్సిలర్లు మర్రి శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యురాలు గీతా మధుకర్ చేరారు. – మేడ్చల్, జూలై 2;

టోక్యో సదస్సుకు ప్రా. జగన్మోహన్

ఖైరతాబాద్, జూలై 2: ఇంటర్నేషనల్ అలయెన్స్ ఫర్ హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్, డ్యాన్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జపాన్‌లోని గయాకీ యూనివర్సిటీలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధ జగన్మోహన్ హాజరు కానున్నారు. ఈ సదస్సులో ఉస్మానియా యూనివర్సిటీ కబడ్డీ ఆటగాళ్లలో వేగాన్ని ప్లయోమెట్రిక్ ఎక్సర్‌సైజుల ద్వారా ఎలా పెంపొందించాలనే అంశంపై డాక్టర్ జగన్మోహన్ ప్రసంగిస్తారు.

పర్యావరణ సంస్థ సభ్యులకు 6న అవార్డులు

సిటీబ్యూరో, జూలై 2(నమస్తే తెలంగాణ): పర్యావరణ పరిరక్షణకు సేవలందిస్తున్న కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవోల్యూషన్ పర్యావరణ సంస్థ సభ్యులను జాతీయ పురస్కారాలతో సత్కరిస్తున్నట్లు సంస్థ చైర్‌పర్సన్ లీలా లక్ష్మా రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రదానోత్సవం ఈ నెల 6న జరగనుందన్నారు. ఢిల్లీకి చెందిన ప్రతిష్టాత్మకమైన పౌర సంస్థ 'క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ' ఈ అవార్డులను అందిస్తుందని తెలిపారు. కాగా, డాక్టర్ కె.తులసీరావుకు పర్యావరణ జాతీయ అవార్డు, దిలీప్ రెడ్డికి నూకల నరోత్తమ్‌రెడ్డి జాతీయ అవార్డు, దొంతి నర్సింహారెడ్డికి ప్రొ.టి.శివాజీరావు జాతీయ అవార్డు, డా.ఏ.కిషన్ రావుకు ఎర్త్‌కేర్ ఎన్విరాన్‌మెంట్ జాతీయ అవార్డు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కాగా, ఈ అవార్డు ప్రదానోత్సవం నల్సార్ యూనివర్సిటీలో శనివారం మధ్యాహ్నం 3:30 గంటలకు జరగనుందని చెప్పారు. ఈ సందర్భంగా సాంకేతిక పరిజ్ఞానం న్యాయం మానవీయత అన్న అంశంపై భారత అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణితో ప్రసంగ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రెవంత్ రెడ్డి పాల్గొంటారని చెప్పారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏ.కె.పట్నాయక్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే అతిథిగా పాల్గొంటారని వివరించారు.



డాక్టర్ బీసీ రాయ్ పేరిట నెలకొల్పిన అవార్డులను ప్రముఖ వైద్యులకు ప్రదానం చేసిన జయప్రకాష్ నారాయణ, ఉడయవర్లు.

వైద్యులు సేవా భావంతో వ్యవహరించాలి

డాక్టర్ జయప్రకాష్ నారాయణ

తెలుగు యూనివర్సిటీ, జూలై 2: వైద్యులు సేవాభావంతో వృత్తిని కొనసాగించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాష్ నారాయణ అన్నారు. కమలాకర మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు, లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుల్తాన్‌బజార్‌లో గల శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ప్రాంగణంలో గల ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం డాక్టర్ బీసీ రాయ్ జయంతి వేడుక ఘనంగా జరిగింది. డాక్టర్ బీసీ రాయ్ పేరిట నెలకొల్పిన అవార్డులను ఉస్మానియా దవాఖాన పూర్వ సూపరింటెండెంట్ డా.బాలాంబ , దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ దవాఖాన మెడికల్ డైరెక్టర్ డా. వైఎస్ఎన్ మూర్తి, ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ డా. దాస్‌లకు ప్రదానం చేసి సత్కరించారు.

''ఖైరతాబాద్ గణేశ్‌కు దేశంలోనే చెప్పుకోదగిన ప్రత్యేక స్థానం ఉంది. 'ఖైరతాబాద్ అంటేనే గణేశ్.. గణేశ్ అంటేనే ఖైరతాబాద్' అన్నంత పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నది.. ఆ మహా గణపతి విగ్రహం. ఇక్కడ నిలబెట్టే గణనాథుని విగ్రహానికి దాదాపు ఏడు దశాబ్దాల చరిత్ర ఉన్నది. గతంలో 'సాగర సంగమం' లాంటి హేమాహేమీ చిత్రాల షూటింగ్ సైతం ఇక్కడ జరుపుకున్నదంటే.. అతిశయోక్తి కాదు. అయితే, చరిత్రకు అనుగుణంగానే డెబ్భై అడుగుల విగ్రహాన్ని ఉత్సవ కమిటీ ఈ ఏడాది నిలబెడుతున్నది. ఇది హర్షించదగిన విషయం. ఇంత పెద్ద విగ్రహ నిర్మాణం గతంలో ఎప్పుడూ చేపట్టలేదు. 63 అడుగుల వరకే నిర్మించారు. ఇందుకు సంబంధించి మంగళవారం నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ ఏడాది భక్తులకు, వీక్షకులకు ఖైరతాబాద్ గణపతి కనువిందు చేయనుంది.''

మహా పనులు షురూ..

- ఇప్పటికే ఆలస్యమవడంతో 200 మంది కార్మికులతో పనులు
- వినాయకచవితికి రెండ్రోజుల ముందు 70 అడుగుల విగ్రహం సిద్ధం
- ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్ కుమార్

ఖైరతాబాద్, జూలై 2: ఖైరతాబాద్ గణేశుడి విగ్రహ ప్రతిష్ఠాపనకు మంగళవారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది విభిన్న రూపాల్లో దర్శనమిస్తున్న మహా గణపతి ఈ సంవత్సరం కూడా ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ చరిత్రలోనే రికార్డు స్థాయిలో 70 అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 17న కర్ర పూజతో అంకురార్పణ జరుగగా, నిర్మాణ పనులు కొంత ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దశాబ్దాలుగా స్వామి వారి విగ్రహాన్ని రూపకల్పన చేస్తున్న శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ ఈ సారి కూడా విగ్రహ నిర్మాణంలో నిమగ్నమయ్యారు. వర్షాకాలంలో 70 అడుగుల ఎత్తులో మట్టి విగ్రహాన్ని తయారు చేయాలంటే కత్తి మీద సామే. దీంతో ఉత్సవ కమిటీ, శిల్పి రాజేంద్రన్ విగ్రహ నిర్మాణంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వానకు తట్టుకునేలా తొలుత షెడ్లను నిర్మిస్తున్నారు.

> **1954లో ఉత్సవ కమిటీ ప్రస్థానం**

1954లో ఉత్సవ కమిటీ ప్రస్థానం మొదలైంది. ఈ ఏడాదికి 70వ దశకంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా అన్నే అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నాం. నిర్మాణ పనుల్లో కొంత ఆల్యమైనందుకే అధిక సంఖ్యలో కార్మికులను రప్పించాం. 70 అడుగుల విగ్రహాన్ని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. వినాయకచవితికి ఒకటి, రెండు రోజుల ముందు విగ్రహం సిద్ధమవుతుంది.

– ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్ కుమార్

220 మంది కార్మికులతో నిర్మాణం

ఖైరతాబాద్ గణపతి విగ్రహ నిర్మాణంలో కొంత